క్లుప్తంగా

వరద బాధితులను ఆదుకోవాలి



మాట్లాడుతున్న వెంకన్న

యైటింక్లయిన్‌కాలనీ: వర్షాల కారణంగా నష్టపోయిన రైతులను, వరద బాధితులను రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ ఉమ్మడి కరీంనగర్ జిల్లా నాయకుడు ఎ.వెంకన్న డిమాండ్ చేశారు. ఆర్జీ–2 ఏరియా యైటింక్లయినకాలనీ ఐఎఫ్‌టీయూ కార్యాలయంలో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 10 రోజుల నుంచి కురుస్తున్న భారీ వర్షాలతో చాలా మంది ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారని, అనేక ప్రాంతాలు, గ్రామాల్లో పొలాలు నీటి మునిగాయన్నారు. ప్రభుత్వం ముందస్తు చర్యలు తీసుకోకపోవడంతోనే ఈ పరిస్థితి నెలకొందని ఆరోపించారు. రైతులతో పాటు ఇళ్లు దెబ్బతిన్న వారికి పరిహారం చెల్లించాలని కోరారు. అలాగే వరద ప్రాంతాల్లో పేరుకుపోయిన బురదను త్వరగా తొలిగించేలా సహాయక చర్యలు చేపట్టాలన్నారు. న్యూడెమోక్రసీ మంథని డివిజన్ కార్యదర్శి అశోక్, నాయకులు బుచ్చమ్మ, రమేష్, రాజనర్సు, కాంతమ్మ, స్వామి, రాయమల్లు, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రయాణికుల సౌకర్యార్థం బెంచీలు ఏర్పాటు



బెంచీల ఏర్పాటును ప్రారంభిస్తున్న సీఐ

జ్యోతినగర్: ప్రయాణికుల సౌకర్యార్థం రామగుండం ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న తాళ్లపల్లి లింగమూర్తి తన సొంత డబ్బులతో బెంచీలను ఏర్పాటు చేసి అందించిన మూడు బెంచీలను ట్రాఫిక్ సీఐ ప్రవీణ్‌కుమార్ శనివారం ప్రారంభించారు. మల్కాపూర్ క్రాస్‌రోడ్ రాజీవ్ రహదారి బస్‌స్టాప్ వద్ద చాలా మంది ప్రయాణికులు బస్సుల కోసం వేచిచూసేవారు. ఆ ప్రాంతంలో విధులు నిర్వహించే లింగమూర్తి తన తల్లిదండ్రులు లక్ష్మి–ఉప్పలయ్య జ్ఞాపకార్థం మూడు సిమెంట్ బెంచీలను ఏర్పాటు చేశారు.

నిత్యావసర సరుకులు అందజేత



జ్యోతినగర్: వరద ముంపునకు గురైన నిరుపేద కుటుంబానికి డీసీసీ అధ్యక్షుడు రాజ్‌ఠాకూర్ ఆదేశాలతో యూత్ కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ నజీమొద్దిన్ సహకారంతో 23వ డివిజన్‌లోని నిరుపేద కుటుంబానికి శనివారం నిత్యావసర సరుకులు అందించారు. మెహరాజ్, అజయ్, ఇమ్రాన్, హరి, మధు ఉన్నారు.

ఆలయ నిర్మాణానికి విరాళం



విరాళం అందజేస్తున్న కట్ల సంపత్

సుల్తానాబాద్: పట్టణంలోని పూసాల శ్రీలక్ష్మీ నారాయణ స్వామి ఆలయ నిర్మాణానికి కట్ల సంపత్–అరుణ దంపతులు రూ.25వేల విరాళాన్ని ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు. పూసాల గ్రామానికి చెందిన ఉస్తెం ఉమ–లక్ష్మీనారాయణ రూ.25వేలు, పూసాల గ్రామానికి చెందిన పూసాల అన్నపూర్ణ–సాంబమూర్తి దంపతులు రూ.10వేలు శనివారం విరాళంగా అందజేశారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు కోట రంగారెడ్డి మాట్లాడుతూ 200 ఏళ్ల అతి పురాతన ఆయయమని, శిథిలావస్థకు చేరుకోవడంతో పూసాల గ్రామానికి చెందిన పలువురు ముందుకు వచ్చి పునర్ నిర్మాణానికి దాతలు ముందుకు రావాలని కోరారు. జిల్లా పరిషత్ మాజీ సభ్యులు గుర్రాల మల్లేశం, మాజీ ఎంపీటీసీ సభ్యులు ఆశాలు, పురం రమణ, ఉస్తెం రవీందర్ ఉన్నారు.

మద్యం తాగి వాహనాలు నడిపితే చర్యలు

ఓదెల: మద్యం తాగి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తప్పవని పొత్కపల్లి ఎస్సై నూతి శ్రీధర్ పేర్కొన్నారు. పొత్కపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని గూడెం, పొత్కపల్లి, ఇందుర్తి గ్రామాల్లో శనివారం డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు చేశారు. జమ్మికుంట నుంచి కాల్వశ్రీరాంపూర్, సుల్తానాబాద్ వైపు వెళ్లే వాహనాలను తనిఖీ చేశారు.

గార్డెనింగ్‌పై ఆసక్తి

- ఆకట్టుకుంటున్న మొక్కలు, రంగుల తొట్లెలు
- కొనుగోలు చేస్తున్న ప్రకృతి ప్రియులు
- గార్డెనింగ్‌పై మక్కువ చూపుతున్న పట్టణవాసులు
- అందుబాటులో పూలు, పండ్లు, ఔషధ మొక్కల విక్రయం

సండే స్పెషల్



కోల్‌సిటీ: ఉదయం నిద్రలేవగానే.. అలా బాల్కనీలోకి వెళ్లి అప్పుడే పూసిన చామంతి, గులాబీని చూస్తే.. ప్రశాంతంగా ఉంటుంది. ఇంటి మేడపైకి చకచకా పాకుతున్న మల్లె తీగల మాటున దాగిన మొగ్గల వాసన నాసికకు తాకితే.. అలా మత్తులో తేలిపోతాం. మనసు దోచే మొక్కల కోసం ఆరాటపడేవాళ్లు, మొక్కలపై మమకారం ఉన్నవాళ్లు ఇప్పుడు మొక్కల కొనుగోలుపై మొగ్గుచూపుతున్నారు. 'ప్రకృతి' ఈ పేరును తలుచుకోగానే.. పచ్చని చెట్లు, ఆకట్టుకునే పువ్వులు, పండ్ల తోటలు గుర్తుకు వస్తాయి. కాంక్రీట్ జంగిల్‌గా మారుతున్న జిల్లాలోని పలు కాలనీలను.. పచ్చని తోరణంగా మార్చడానికి ప్రకృతి ప్రియులు గార్డెనింగ్‌బాట పడుతున్నారు.

ఆకట్టుకుంటున్న నర్సరీలు

జిల్లాలోని పెద్దపల్లి, గోదావరిఖనిలోని పలు నర్సరీల్లో విక్రయిస్తున్న మొక్కలు ఆకట్టుకుంటున్నాయి. గోదావరిఖని ఆర్టీసీ డిపో ఎదుట వందలాది మొక్కలను విక్రయిస్తున్నారు. గులాబీలో 40 రకాలు, మందారలో 20 రకాలు, చామంతిలో 25 రకాల అందమైన పూల మొక్కలతోపాటు మల్లెపూల మొక్కలు, ఇళ్లు, కార్యాలయాలు, హోటళ్లకు అందాన్నిచ్చే పిటోనియా, లైటాస్, ఆర్కెఫామ్స్, క్రిస్మస్ ట్రీ, క్రోటిన్, స్టార్‌లైట్‌లతోపాటు కొబ్బరి, సపోట, దానిమ్మ, మామిడి, బత్తాయి, ఉసిరి, సీతాఫలం, ద్రాక్ష, ఆపిల్, అంజీర తదితర పండ్ల మొక్కలు, ఔషధ మొక్కలను కూడా విక్రయిస్తున్నారు. మొక్కలను నాటడానికి అవసరమైనవారికి ఎర్రమట్టిని, రంగురంగు తొట్లను కూడా విక్రయిస్తున్నారు.

మనసు దోచే మొక్కలు

ఇంటి ఆవరణలో తక్కువ స్థలం ఉన్నవారు సైతం కుండీల్లో మొక్కలను పెంచుకుంటున్నారు. ప్రస్తుత వర్షాకాలంలో మనసుకు నచ్చిన మొక్కలను ఇంట్లో నాటేందుకు ఇష్టపడుతున్నారు.



వర్షాకాలంలోనే నాటాలి



వర్షాకాలంలో నాటితేనే మొక్కలు ఆరోగ్యంతో ఎదుగుతాయి. మొక్కలు ఇంటికి అందంతో పాటు ఆరోగ్యాన్ని ఇస్తాయి. ప్రతి ఇంట్లో మొక్కలను పెంచడం అలవాటు చేసుకోవాలి. ఇంట్లో స్థలం లేనివారు కూడా కుండీల్లో నచ్చిన మొక్కలను నాటుకోవచ్చు. తక్కువ ధరలతో ప్రజలకు ఇష్టమైన పూల మొక్కలు, పండ్ల మొక్కలను అమ్ముతున్నాం.

– కృష్ణ, నర్సరీ నిర్వాహకుడు

ఔషధ మొక్కలు అందుబాటులో



బెంగళూరు, రాజమండ్రి నుంచి మొక్కలను తెప్పిస్తున్నాం. వరండాలో మొక్కలను వేలాడదీయడానికి ప్రత్యేక రంగు రంగుల చిన్న కుండీలను తెప్పించాం. వందలాది అందమైన పూల మొక్కలు, పండ్ల మొక్కలు, ఔషధ మొక్కలు అందుబాటులో ఉన్నాయి. ఎరువులు కూడా విక్రయిస్తున్నాం. మనసు ఒత్తిడి నుంచి బయటపడేసే ప్రకృతి నేస్తాలు మొక్కలు.

– రాము, నర్సరీ నిర్వాహకుడు

డోర్ డెలివరీ చేస్తాం



ఇంట్లో మొక్కలు నాటాలని కోరుకునే వారు ఒక్క ఫోన్‌కాల్ చేస్తే చాలు, ఇంటికే నచ్చిన మొక్కలను డోర్ డెలివరీ చేస్తాం. సుగంధాలు వెదజల్లే మొక్కలు, ఆక్సిజన్ అందించే మొక్కలతో ఇంటిని సుందరీకరణంగా మారుస్తాం. ల్యాండ్ స్కేపింగ్, వెజిటేబుల్ గార్డెన్, టెర్రస్ గార్డెన్, వర్టికల్ గార్డెన్, ఇండోర్, ఔట్ డోర్ గార్డెన్ ఇలా కోరుకున్న విధంగా తీర్చిదిద్దుతాం.

– పిట్టల రాజ్‌కుమార్, గోదావరిఖని

కులమతాలకు అతీతంగా మొహర్రం



కమాన్‌పూర్: మొక్కులు చెల్లిస్తున్న భక్తులు



జ్యోతినగర్: మల్కాపూర్‌లో పీరీల ఊరేగింపు



సుల్తానాబాద్‌లో..

సుల్తానాబాద్‌రూరల్: సుల్తానాబాద్ మండలంలోని గ్రామాల్లో మొహర్రం పండగ వేడుకలను శనివారం ఘనంగా జరుపుకున్నారు. మండలంలోని కనుకుల, మంచిరామి, రామునిపల్లె, రేగడిమద్దికుంట, జండాపల్లె, గట్టెపల్లి గ్రామాల్లో కులమతాలకు అతీతంగా పీరీలను దర్శించుకున్నారు. ఖాజామైనొద్దిన్, రఫి, జానీ, మజీద్, జాహంగీర్, రసూల్, అజ్జు, రజాక్, సర్వర్ ఉన్నారు.

రామగుండం: మొహర్రం పండుగ వేడుకలను అంతర్గాం, రామగుండం మండల ప్రజలు శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అంతర్గాం మండల కేంద్రంలో ముస్లింలు పీరీలను ఊరేగించగా పలువురు పీరీలను దర్శించుకున్నారు. అనంతరం అంతర్గాం జంక్షన్‌లో మసీద్ కమిటీ ఆధ్వర్యంలో షర్బత్ పంపిణీ చేశారు.

జ్యోతినగర్: మొహర్రం పర్వదినం సందర్భంగా పీరీలను ఘనంగా ఊరేగించారు. శనివారం ఎన్టీపీసీ రామగుండం మేడిపల్లి సెంటర్, కృష్ణానగర్, భీమునిపట్నం, ఐదో డివిజన్ మల్కాపూర్, నర్రాశాలపల్లె, మూడో డివిజన్ న్యూపోరట్‌పల్లిలో పీరీలను ఊరేగించారు.

జూలపల్లి: మండలంలోని వడ్కాపూర్‌లో ఆదివారం మొహర్రం వేడుకలు నిర్వహించారు. అన్నివర్గాల ప్రజలు మొక్కులు చెల్లించారు. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రఘువీర్‌సింగ్ పీరీలను దర్శించుకొన్నారు. మసీదులో భక్తుల సౌకర్యార్థం స్టాండింగ్ ఫ్యాన్ బహూకరించారు. సర్పంచ్ మాంకాలి తిరుపతి, మండల వైస్ చైర్మన్ మొగురం రమేశ్, అన్వామియా, బీఆర్ఎస్ నాయకుడు కన్నం రమేశ్ పాల్గొన్నారు.

కమాన్‌పూర్: కమాన్‌పూర్, రామగిరి మండలాల్లో మొహర్రం(పీరీల)పండుగ వేడుకలను శనివారం మతాలకు అతీతంగా జరుపుకున్నారు. భక్తులు పీరీలకు కుడుక, దస్తీలు, వెండి గొడులు కట్టి మొక్కులు చెల్లించారు. మసీద్‌ల వద్ద ఏర్పాటు చేసిన గుండం చుట్టూ అసైదులా ఆటపాటలతో హోరెత్తించారు.

ఎలిగేడు: మండలంలోని సుల్తాన్‌పూర్ గ్రామాలతో పాటు పలు గ్రామాల్లో మొహర్రం వేడుకలు ఘనంగా నిర్వహించారు. సుల్తాన్‌పూర్‌లో ఎంపీపీ తానిపర్తి స్రవంతి–మోహన్‌రావు దంపతులు ప్రత్యేక పూజలు చేశారు.

ఫెర్టిలైజర్‌సిటీ: కులమతాలకు అతీతంగా నిర్వహించే మొహర్రం వేడుకలను రామగుండం కార్పొరేషన్ 14, 39వ డివిజన్, పాలకుర్తి మండలం ఎల్కలపల్లి, గుంటూరుపల్లి గ్రామాల్లో శనివారం ఘనంగా నిర్వహించారు. వీర్లపల్లి గ్రామంలో పీరీల ఉత్సవాలను 130ఏళ్లుగా నిర్వహిస్తున్నారు.

సుల్తానాబాద్: సుల్తానాబాద్‌లో పలువురు ప్రముఖులు మొహర్రం పండుగ సందర్భంగా పీరీలను సందర్శించి మొక్కులు సమర్పించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ ముత్యం సునీత, వైస్‌చైర్మన్ బిరుదు సమత, కౌన్సిలర్ గాజుల లక్ష్మి పాల్గొన్నారు.

ఓదెల: మండలంలోని కనగర్తి, కొలనూర్, పొత్కపల్లి, గుంపుల ఓదెల గ్రామాల్లో పీరీల ఊరేగింపు నిర్వహించారు.

యైటింక్లయిన్‌కాలనీ: రామగుండం కార్పొరేషన్ యైటింక్లయిన్‌కాలనీలో మొహర్రం వేడుకలు నిర్వహించారు. కాలనీ 18వ డివిజన్ అల్లూరు దర్గాలోని పీరీలను సంతోష్ నగర్, హనుమాన్‌నగర్, ఇందిరానగర్, అల్లూరు ఏరియాల్లో ఊరేగించారు.

ఎన్టీపీసీ భూ నిర్వాసితులకు ఉద్యోగాలు కల్పించాలి

జ్యోతినగర్: ఎన్టీపీసీ రామగుండం ప్రాజెక్టు భూ నిర్వాసితులకు ఇంటికో ఉద్యోగం ఇవ్వాలని భూ నిర్వాసిత వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు వేముల వెంకటేశ్వర్లు ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. సంస్థ నిర్మాణ సమయంలో వ్యవసాయ భూములు, ఇళ్లు కోల్పోయిన 17 గ్రామాల భూ నిర్వాసితులకు చాలీచాలని పరిహారం అందించి భూములను తీసుకున్నారన్నారు. 1987 నుంచి 2023 వరకు భూ నిర్వాసితులకు మాత్రం సరైన ఉపాధి కల్పించలేదని ఆరోపించారు. విద్యుత్ ప్రాజెక్టు అభివృద్ధి చెందుతున్నప్పటికీ భూ నిర్వాసితులకు ఎందుకు అవకాశాలు కల్పించడం లేదని ఆయన ప్రశ్నించారు. భూనిర్వాసిత కుటుంబాలకు జరిగిన అన్యాయంపై చర్చించి భవిష్యత్ పోరాటాలకు మార్గదర్శనం చేసుకునే సమయం ఆసన్నమైందన్నారు. 31వ తేదీన ఎన్టీపీసీ రామగుండం మేడిపల్లి సెంటర్‌లోని సాయి సేవాసమితి సామాజిక భవనంలో సమావేశం ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. సమావేశానికి అత్యధికంగా భూ నిర్వాసితులు హాజరుకావాలని పిలుపునిచ్చారు.

షార్ట్ ఫిలిం డైరెక్టర్‌కు సన్మానం

కమాన్‌పూర్: రామగిరి మండలం రామయ్యపల్లెకు చెందిన మాజీ సర్పంచ్, షార్ట్ ఫిలిం డైరెక్టర్ బుదార్తి బుచ్చన్నను శనివారం రామగిరి మండల కేంద్రంలో బుచ్చన్న స్నేహితులు సన్మానించారు. ఎద్దు ఏడ్చిన ఎవుసం అనే పేరుతో షార్ట్ ఫిలిం తీసి ఉత్తమ షార్ట్ ఫిలిం అవార్డు అందుకున్న సందర్భంగా సన్మానించినట్లు వారు తెలిపారు. నాయకులు ఆరెల్లి కొమురయ్య, కన్నూరి శ్రీశైలం, శ్రీనివాస్, మోహన్, తిరుపతి, సతీశ్, కుమార్, సంతోష్‌గౌడ్, నారాయణ, లక్ష్మణ్, రఘుపతి పాల్గొన్నారు.

బియ్యం అందజేత



జ్యోతినగర్: రామగుండం కార్పొరేషన్ 22వ డివిజన్ సుభాష్‌నగర్‌లో కార్పొరేటర్ కౌశిక లత జెన్‌కో యాష్‌పాండ్ నీటి ముంపునకు గురైన వారిని శనివారం పరామర్శించారు. 60 మంది నిరుపేదలకు ఒక్కో కుటుంబానికి 10కిలోల చొప్పున బియ్యం అందజేశారు. ప్రభుత్వపరంగా పరిహారం చెల్లించాలని కోరారు. కాలనీవాసులు, వరద ముంపు బాధితులు పాల్గొన్నారు.

ఆర్యవైశ్య కార్పొరేషన్ సాధనకు ఉద్యమిద్దాం

కాల్వశ్రీరాంపూర్: ఆర్యవైశ్య కార్పొరేషన్ సాధన కోసం ఉద్యమిద్దామని కాల్వశ్రీరాంపూర్‌లో ఆర్య వైశ్య సంఘం నాయకులు పిలుపునిచ్చారు. ఈ మేరకు కాల్వ శ్రీరాంపూర్‌లో సంఘం అధ్యక్ష, కార్యదర్శులు యాంసాని రాఘవులు, అశోక్ శనివారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ప్రభుత్వం నిరుపేద ఆర్యవైశ్యుల కోసం ఆర్యవైశ్య కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. 31న సోమవారం కరీంనగర్‌లోని టవర్ సర్కిల్‌లో ఉదయం 10 గంటలకు డిమాండ్ల సాధనకు చేపట్టనున్న నిరసన దీక్ష కార్యక్రమానికి ఆర్యవైశ్యులు అధికసంఖ్యలో తరలిరావాలని ఆయన ఈ సందర్భంగా కోరారు.

కొత్తూరులో ఇంటింటా ఫీవర్ సర్వే



పరీక్షలు చేస్తున్న వైద్యాధికారి

ధర్మారం: మండలంలోని మేడారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి అనుదీప్ ఆధ్వర్యంలో శనివారం కొత్తూరు గ్రామంలో ఇంటింటా ఫీవర్ సర్వే చేశారు. మంత్రి కొప్పుల ఈశ్వర్ ఆదేశాల మేరకు వైద్య బృందం గ్రామంలో ఇంటింటా తిరుగుతూ వైద్య పరీక్షలు నిర్వహించారు. జ్వర బాధితులకు పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. 2863 మందిని స్క్రీనింగ్ చేసినట్లు వైద్యాధికారి వెల్లడించారు. 32 మందికి జ్వరం లక్షణాలు ఉండగా మరో 20 మంది నుంచి రక్త నమూనాలు సేకరించినట్లు తెలిపారు. వైద్యులు సుస్మిత, గౌతమ్, డాక్టర్ అమర్నాథ్, డాక్టర్ మాణిక్యజ్యోతి, సూపర్‌వైజర్లు జయ, జీవరాణి, దామోదర్‌రెడ్డి, ఏఎన్‌ఎంలు కరుణ, ల్యాబ్ టెక్నీషియన్ రమేశ్, విమల్, మల్లేశం, రాకేశ్ పాల్గొన్నారు.

కార్యకర్తలు సైనికుడిలా పనిచేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే చందర్

గోదావరిఖని: వచ్చే ఎన్నికల్లో కార్యకర్తలు సైనికులుగా పనిచేయాలని రామగుండం ఎమ్మెల్యే కోరుకంటి చందర్ తెలిపారు. శనివారం స్థానిక తిలక్‌నగర్‌లోని ఓ ఫంక్షన్‌హాల్‌లో బీఆర్ఎస్ బూత్ లెవల్ సమావేశంలో మాట్లాడారు. తెలంగాణకు కాంగ్రెస్ ఆరు దశాబ్దాలు ఏమీ చేయలేదన్నారు. సంక్షేమ పథకాలే రానున్న ఎన్నికల్లో బీఆర్ఎస్‌ను గెలిపిస్తాయన్నారు. కార్పొరేటర్లు దొంత శ్రీనివాస్, నాయకులు పర్లపెల్లి రవి, నారాయణదాసు మారుతి, తోడేటి శంకర్‌గౌడ్, జేవీ.రాజు, రాకం వేణు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌తోనే ముస్లింలకు గౌరవం..

బీఆర్ఎస్ ప్రభుత్వంలోనే ముస్లింలకు గౌరవం లభిస్తోందని ఎమ్మెల్యే అన్నారు. పలువురు బీఆర్ఎస్‌లో చేరగా కండువా పార్టీలోకి కప్పి ఆహ్వానించారు. పార్టీ చేరికల కమిటీ సభ్యులు జాహిద్‌పాషా, కో–ఆప్షన్ సభ్యులు రఫీ, నాయకులు పాల్గొన్నారు. ముందుగా మక్కాయాత్రకు వెళ్తున్న ముస్లింలను సన్మానించారు.

అందరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి



మాట్లాడుతున్న ట్రాఫిక్ సీఐ ప్రవీణ్‌కుమార్

గోదావరిఖని: ప్రయాణికులు రాంగ్‌రూట్‌లో వెళ్లి ప్రాణాల మీదకు తెచ్చుకోవద్దని, ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నియమ నిబంధనలు పాటించాలని రామగుండం ట్రాఫిక్ సీఐ తంగెళ్ల ప్రవీణ్‌కుమార్ కోరారు. లారీ ఢీకొని వృద్ధురాలు మృతి చెందిన ప్రమాద ప్రాంతాన్ని ఆయన శనివారం సందర్శించారు. ప్రమాదాలు జరగకుండా ప్రయాణికులకు అవగాహన కల్పించారు. గోదావరిఖని ఫ్లెఓవర్ సమీపంలోని హైవే నుంచి మంథనికి వెళ్లే దారిలో మిలీనియం క్వార్టర్స్ మలుపు వద్ద ప్రమాదాలు జరిగే అవకాశాలున్నాయన్నారు. ప్రధాన రహదారి నుంచి మంథనికి వెళ్లే వైపు రోడ్‌క్రాస్ చేస్తున్న సమయంలో వాహన వేగం తగ్గించి నెమ్మదిగా వెళ్లాలని, రాజీవ్ రహదారిపై వాహనాలు వేగంతో వస్తాయి కాబట్టి వాటిని గమనిస్తూ ముందుకు వెళ్లాలన్నారు. హెడ్ కానిస్టేబుళ్లు బాయి శ్రీనివాస్, సత్యనారాయణ, లక్ష్మణ్, కానిస్టేబుల్ అశోక్ పాల్గొన్నారు.

నిరుపేద కుటుంబానికి ఆర్థికసాయం

జ్యోతినగర్: ఎన్టీపీసీ రామగుండం ఎఫ్‌సీఐ క్రాస్‌రోడ్ ఆటో యూనియన్ కోశాధికారి ఎల్లె శ్రీనివాస్ కూతురు సాహితి వైద్య చికిత్స కోసం ఎమ్మెల్యే కోరుకంటి చందర్ చేతుల మీదుగా రూ.లక్ష అందజేశారు. సాహితి వైద్యం కోసం శ్రీనివాస్ రూ.4లక్షలు ఖర్చు చేశారు. మరింత డబ్బు అవసరం కాగా బలగం సభ్యులు బడుగు సమ్మయ్య, పులవేన క్రాంతి, బైరం సతీశ్ సాయం కోరిన మేరకు వేణుమాధవ్ సంగాని, మౌనిక, వరుణ్ బడుగు కల్యాణ్‌తో పాటు ఇతర మిత్రులు స్పందించి జమ చేసిన లక్ష రూపాయలను ఎమ్మెల్యే చేతుల శ్రీనుకు అందజేశారు. బాధిత కుటుంబానికి అండగా ఉండేందుకు దాతలు ఫోన్ పే/గూగుల్ పే 90309 53867(ఎల్లె శ్రీనివాస్) నంబర్‌కు ఆర్థిక సాయం అందజేయాలని ఎమ్మెల్యే చందర్ కోరారు. రామగుండం మేయర్ బంగి అనిల్‌కుమార్, డిప్యూటీ మేయర్ నడిపల్లి అభిషేక్‌రావు ఉన్నారు.

సంక్షిప్త వార్తలు

✦ పాత ఇళ్లలో ఉండేవారు జాగ్రత్త

సుల్తానాబాద్: ప్రజలు పాత ఇళ్ల గోడలతో జాగ్రత్తగా ఉండాలని తహసీల్దార్ యాకన్న శనివారం సూచించారు. పూసాలలోని 15వ వార్డులో వర్షానికి నానిన ఇంటి గోడలు కూలిపోయాయి. ఇప్పటివరకు స్థానిక అధికారులు, ప్రజా ప్రతినిధులు తెలిపిన వివరాల ప్రకారం 27 గృహాలు కూలిపోయాయని ఆయన వెల్లడించారు.

✦ అద్దె వాహనాల యూనిట్ రేటు పెంచాలి

గోదావరిఖని: సింగరేణిలో నడుస్తున్న అద్దెవాహనాల యూనిట్ రేటు పెంచాలని సింగరేణి భూనిర్వాసితుల అద్దెవాహనాల యాజమానులు కోరారు. రామగుండం ఎమ్మెల్యే కోరుకంటి చందర్, టీబీజీకేఎస్ ప్రధాన కార్యదర్శి మిర్యాల రాజిరెడ్డిని శనివారం వేర్వేరుగా కలిసి వినతిపత్రం అందజేశారు. వాహనాలపై పనిచేస్తున్న డ్రైవర్లకు సీఎంపీఎఫ్ చెల్లించే బాధ్యత యాజమాన్యం తీసుకోవాలన్నారు. యూనిట్‌రేట్ పరిస్థితులను బట్టి పెంచే విధానం ఉండాలన్నారు. ప్రస్తుతం నడుస్తున్న అద్దె వాహనాల కాలపరిమితి మూడేళ్ల నుంచి ఆరేళ్లకు పెంచాలని కోరారు. అదనపు కిలోమీటర్‌కు రూ.20 చెల్లించాలని, 12గంటల విధానాన్ని పూర్తిగా రద్దు చేసి 8 లేదా 16 గంటల విధానాన్ని కొనసాగించాలన్నారు. వాహనాల బ్రేక్‌డౌన్ సమయంలో ఫెనాల్టీ, జీఎస్టీ లేకుండా స్లాబ్ రేట్ ప్రకారం కట్ చేయాలని విజ్ఞప్తి చేశారు. నాయకులు సుందిళ్ల నాగరాజు, ధర్మరావు, రాజయ్య ఉన్నారు.

✦ జీజీహెచ్ సిబ్బంది తాత్కాలిక చర్యలు

కోల్‌సిటీ: గోదావరిఖనిలోని జీజీహెచ్ ఆస్పత్రి ప్రాంగణంలో బురదమయంగా మారిన రోడ్డుపై ఆస్పత్రి సిబ్బంది శనివారం తాత్కాలిక చర్యలు చేపట్టారు. కొత్త బ్లాక్‌కు వెళ్లడానికి పేషెంట్లతోపాటు ఆస్పత్రి సిబ్బంది కూడా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇటీవల ఆస్పత్రిని సందర్శించిన కలెక్టర్ కూడా ఇబ్బంది పడ్డారు. ఇబ్బందులను తొలగించడానికి బురదగా ఉన్న ప్రాంతంలో సిబ్బంది ఇసుక పోసి తాత్కాలిక చర్యలు చేపట్టారు.

✦ రేపు విద్యారంగ సమస్యలపై రౌండ్‌టేబుల్ సమావేశం

పెద్దపల్లిరూరల్: పట్టణంలోని శాంతినగర్‌లో గల శ్రేయ ఒకేషనల్ జూనియర్ కాలేజీలో సోమవారం విద్యారంగ సమస్యలపై రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహిస్తున్నట్లు బహుజన సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నర్సింగ్, కేవీపీఎస్ నాయకులు సురేశ్, శ్రావణ్, అశోక్, రవీందర్, ప్రశాంత్ తెలిపారు.

✦ మహాసభలను విజయవంతం చేయాలి

కమాన్‌పూర్: మంచిర్యాల, పెద్దపల్లి జిల్లా కేంద్రాల్లో 30న నిర్వహించే మోకుదెబ్బ మహాసభలను విజయవంతం చేయాలని రాష్ట్ర ఉపాధ్యక్షుడు కొండ్ర వెంకన్నగౌడ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మహాసభలో గౌడజన హక్కులపై చర్చించనున్నట్లు పేర్కొన్నారు.

పోస్టర్ ఆవిష్కరణ

ధర్మారం: చొప్పదండి మండల కేంద్రంలో ఆగస్టు 6న నిర్వహించే బహుజన రణభేరిని విజయవంతం చేయాలని కోరుతూ బీఎస్పీ మండల అధ్యక్షుడు గొడుగు ప్రశాంత్ ఆధ్వర్యంలో పార్టీ నాయకులు స్థానిక అంబేడ్కర్ చౌరస్తాలో పోస్టర్ ఆవిష్కరించారు. ప్రశాంత్ మాట్లాడుతూ బహుజన సమాజ్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు హాజరయ్యే బహుజన రణభేరి సభను విజయవంతం చేయడానికి మండలంలోని అన్ని గ్రామాల నుంచి బహుజనులు పెద్ద ఎత్తున తరలిరావాలని కోరారు. నాయకులు అనిల్ కుమార్, గుర్రం నరేశ్, రాజు, శ్రీధర్ పాల్గొన్నారు.

పంచాయతీ కార్మికుల వినూత్న నిరసన



జూలపల్లిలో ఆవుకు వినతిపత్రం

ఎలిగేడు: మండల కేంద్రంలో జీపీ ఉద్యోగ, కార్మికులు చేపట్టిన సమ్మె శనివారం 24వ రోజుకు చేరింది. కళ్లు, చెవులు, నోరు, ముక్కు మూసుకుని నిరసన వ్యక్తం చేశారు. జీపీ ఉద్యోగ, కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ఇరుగురాల లచ్చయ్య, కార్యదర్శి ఎండీ.ఖాజ, కవ్వంపల్లి దేవయ్య, మండల అధ్యక్షుడు తీట్ల శ్రీనివాస్, పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.

పెద్దపల్లిరూరల్: పంచాయతీ కార్మికులు శనివారం పెద్దపల్లిలో భిక్షాటన చేశారు. పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ముత్యంరావు, కార్మిక సంఘ ప్రధాన కార్యదర్శి ఖాజా డిమాండ్ చేశారు.

కాల్వశ్రీరాంపూర్: పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరి అవలంబిస్తోందని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు మంద రాజేందర్ మండిపడ్డారు. కాల్వశ్రీరాంపూర్‌లో శనివారం కార్మికుల నిరసన దీక్షలో పాల్గొన్నారు. కార్మికుల సంఘం మండల అధ్యక్షుడు కలవేన గట్టయ్య, నాయకులు పాల్గొన్నారు.

జూలపల్లి: మండలంలోని గ్రామాల నుంచి వచ్చిన కార్మికులు జూలపల్లిలో ఎంపీడీవో కార్యాలయం ఎదుట దీక్షా శిబిరం వద్ద ఆవుకు వినతి పత్రం ఇచ్చి నిరసన తెలిపారు. కార్మిక సంఘం అధ్యక్షుడు సంపత్‌కుమార్, కారోబార్ల సంఘం అధ్యక్షుడు అమరగాని పురుషోత్తం తెలిపారు.

రామగుండం: అంతర్గాం మండల కేంద్రంలోని పంచాయతీ కార్మికుల దీక్షకు సీఐటీయూ సంఘీభావం ప్రకటిస్తూ పంచాయతీ కార్మికుల డిమాండ్ల వినతిపత్రాన్ని గేదెకు అందజేస్తూ ప్రభుత్వ వైఖరిని ఎండగట్టారు. సీఐటీయూ జిల్లా కమిటీ ప్రతినిధులు భిక్షపతి, గీట్ల లక్ష్మారెడ్డి, అడారి నర్సింగరావు ఉన్నారు. దీక్షలో పంచాయతీ కార్మికుల సంఘం మండల అధ్యక్షుడు తూడూరి శ్రీనివాస్‌గౌడ్ పాల్గొన్నారు.